క్లుప్తంగా

ప్లాస్టిక్ యూనిట్ టెండర్ ప్రాసెస్ పూర్తి చేయాలి



మొక్క నాటుతున్న డీఆర్డీఏ పీడీ రఘువరన్

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌లో నిర్మించే ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని డీఆర్‌డీఏ పీడీ రఘువరన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం అయిలాపూర్‌లో యూనిట్ స్థలాన్ని పరిశీలించారు. సామూహిక మరుగు దొడ్లను పరిశీలించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కను నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, ఏపీవో మమత, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన వెల్ఫేర్ కమిషనర్



సమస్యను వివరిస్తున్న శ్రీనివాసులు

జగిత్యాల: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న బీడీ కార్మికుల పిల్లలకు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సమస్యలను పరిష్కరించాలని వెల్ఫేర్ కమిషనర్ శ్రీనివాసులు కోరారు. మంగళవారం అదనపు కలెక్టర్ లతను కలిసి సమస్యను దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సమస్యను పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించండి



జీవన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

జగిత్యాలటౌన్: అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించాల్సిందిగా కోరుతూ జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ రైతులు మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని కోరారు. ఓవర్ లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ తరచూ కాలిపోతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, గ్రామంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరుతూ గత 4 ఏళ్లుగా విద్యుత్ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదన్నారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించాలిన పట్టణంలోని ఇందిరాభవన్‌లో మంగళవారం జీవన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన జీవన్‌రెడ్డి విద్యుత్ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. సమస్య పరిష్కారం కాని పక్షంలో విద్యుత్ శాఖ మంత్రితో మాట్లాడి పరిష్కరిస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

టీనేజ్‌లో సమస్యలు ఎదుర్కొంటేనే ఉన్నత శిఖరాలకు



మాట్లాడుతున్న అడిగా శ్రీనివాస్

కోరుట్ల: విద్యార్థులు టీనేజ్‌లో సమస్యలు సమర్థవంతంగా ఎదుర్కొంటేనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సైకాలజిస్ట్ అడిగా శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని మాస్ట్రో కళాశాలలో మంగళవారం టీనేజ్ ఛాలెంజెస్ అండ్ పవర్ ఆఫ్ గోల్ సెట్టింగ్ అనే అంశంపై మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ విద్యార్థులకు నైపుణ్యాలపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజేశ్, ఉపన్యాసకులు పాల్గొన్నారు.

డీఈవోకు సన్మానం

జగిత్యాల: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో డీఈవో రాము కృషి చేస్తున్నారని తపస్ నాయకులు అన్నారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో కలిసి ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి దేవయ్య, ప్రసాద్‌రావు, నరేందర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒడ్నాల రాజశేఖర్, మహిపాల్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

చెక్కు అందచేత

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాదారుడు పోడేటి సుదర్శన్ కొద్ది రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందగా, బాధిత కుటుంబానికి మంజూరైన రూ. 2లక్షల చెక్కును మృతుడి భార్య పోడేటి అనూషకు మంగళవారం బ్యాంకు మేనేజర్ గోపి కృష్ణ, ఐకేపీ ఏపీఎం శంకర్ తదితరులు అందజేశారు.

మట్టి వినాయకులనే పూజించండి





జగిత్యాలలో మహిళలకు మట్టి గణపతులు పంపిణీ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ రఘువరన్, జిల్లా సంక్షేమాధికారి నరేశ్



ధర్మపురిలో మట్టి విగ్రహాలు పంపిణీలో బీజేపీ నాయకులు



మల్లాపూర్‌లో మోడల్ స్కూల్ విద్యార్థినులు..



ఇబ్రహీంపట్నంలో ఎస్సై అనిల్

జగిత్యాల/జగిత్యాలజోన్/జగిత్యాలరూరల్/కోరుట్ల/ధర్మపురి/రాయికల్/మల్లాపూర్/కథలాపూర్/మల్లాపూర్/మల్యాల/ఇబ్రహీంపట్నం/కొడిమ్యాల/సారంగాపూర్: మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని సంక్షేమాధికారి బోనగిరి నరేశ్ అన్నారు. మంగళవారం చేతన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలసదన్ కార్యాలయంలో 250 మందికి మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల మట్టి వినాయకులను పంపిణీ చేశారు. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు మట్టి గణపతులు పంపిణీ చేశారు. జగిత్యాల సెర్ప్ కార్యాలయంలో మంగళవారం సెర్ప్ సిబ్బందికి, గ్రామ సమాఖ్య సభ్యులకు డీఆర్‌డీఏ పీడీ రఘువరన్ మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. కోరుట్ల పట్టణంలోని కల్లూర్ రోడ్ పీఎం జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థులు 150 మట్టి వినాయక ప్రతిమలు తయారు చేసి మంగళవారం పంపిణీ చేశారు. ధర్మపురి పట్టణంలోని 11 వార్డులో మాజీ కౌన్సిలర్ జక్కు పద్మ ఆధ్వర్యంలో,పట్టణంలోని 2వ వార్డులో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. మల్లాపూర్ మోడల్ స్కూల్‌లో మంగళవారం మెట్‌పల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కథలాపూర్ మండలం పోసానిపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు మట్టితో వినాయకుడి ప్రతిమలను తయారుచేసి మంగళవారం గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఇబ్రహీంపట్నం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో అక్షయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎస్సై అనిల్ చేతుల మీదుగా 350 మట్టి వినాయకులను గ్రామస్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. వర్షకొండ ప్రాథమిక పాఠశాలలో మెట్‌పల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెల్మల శ్రీనివాస్‌రావు తహసీల్దార్ వరప్రసాద్ విద్యార్థులకు 100 మట్టి వినాయకులను పంపిణీ చేశారు. బీర్‌పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం మట్టిగణపతులను తయారు చేసి గ్రామంలో పంపిణీ చేశారు. రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని ఇటిక్యాలలో మోడల్‌స్కూల్, మైతాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులు మట్టి వినాయకులను తయారుచేసి గ్రామస్తులకు పంపిణీ చేశారు. కొడిమ్యాల మండలం చెప్యాల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు వినాయక ప్రతిమలను తయారుచేసి గ్రామస్తులకు పంపిణీ చేశారు. మల్యాల మండలం నూకపల్లి మోడల్ స్కూల్‌లో పీఎంశ్రీ యూత్ ఎకో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టి వినాయకుల విగ్రహాలను తయారు చేసి పంపిణీ చేశారు.





పోసానిపేటలో మట్టి విగ్రహాలతో విద్యార్థులు, టీచర్లు కోరుట్ల జెడ్పీహెచ్ఎస్‌లో మట్టి విగ్రహాల పంపిణీ

బస్సుల కోసం విద్యార్థుల రాస్తారోకో



కుస్తాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

మల్లాపూర్: కళాశాల, పాఠశాల వేళల్లో ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మల్లాపూర్ మండలంలోని కుస్తాపూర్, రత్నాపూర్ గ్రామాలకు చెందిన విద్యార్థులు మంగళవారం కుస్తాపూర్ బస్టాండ్ వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ మల్లాపూర్, కుస్తాపూర్, రత్నాపూర్, సిరిపూర్ గ్రామాల నుండి నిత్యం వందలాది సంఖ్యలో మల్లాపూర్, మెట్‌పల్లికి కళాశాల, పాఠశాల చదువుకోసం వెళ్లి వస్తుంటామని, ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులందరం ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అదనపు బస్సులను నడపాలని మెట్‌పల్లి డీఎంకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. డీఎంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని స్థానిక నాయకులు, గ్రామస్తులు హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

నానో యూరియాపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సాయికిరణ్

వెల్గటూర్: మండలంలోని శాఖాపూర్‌లో మంగళవారం నానో యూరియాపై మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ సాధారణ యూరియాలో 46శాతం నత్రజని ఉంటుంది. ఈ యూరియా పంటకు చల్లినప్పుడు 30 నుండి 40 శాతం మాత్రమే మొక్కు అందుతుందని, 60 నుండి 70 శాతం పొలంలో నీటి ఆవిరి రూపంలో గాలిలో కలిసి గాలిని కలుషితం చేస్తుందని తెలిపారు. కానీ నానో యూరియా వాడడం ద్వారా స్ప్రే చేసినప్పుడు 70 నుండి 80 శాతం వరకు సామర్థ్యంతో సాధారణ యూరియా కంటే శక్తివంతంగా పనిచేస్తుందని తెలిపారు. ఒక ఎకరానికి 500 ఎంఎల్ చొప్పున ఏదైనా పురుగు మందులతో కలిపి అయినా 15 నుంచి 20 రోజు కాల వ్యవధిలో స్ప్రే చేయవచ్చని తెలిపారు. కావున రైతులు యూరియా బస్తాల కోసం ఇబ్బందులు పడకుండా నానో యూరియా వాడాలని కోరారు.

వినియోగదారులకు ఉత్తమ సేవలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రభాకర్‌రావు

జగిత్యాల: వినియోగదారులకు ఉత్తమ సేవలందించడమే లక్ష్యమని భారత టెలికాం ప్రాధికార సంస్థ (ట్రాయ్) కాగ్ సభ్యుడు ప్రభాకర్‌రావు అన్నారు. మంగళవారం ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెలికాం వినియోగదారుల హక్కుల కోసం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా యాక్ట్ అమలులోకి వచ్చిందని, టెలికాం రంగంలో భారత్ రెండోస్థానంలో ఉందన్నారు. 2006 నుంచి మొబైల్ నంబర్ పోర్టబిలిటీ సౌకర్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. 2025 నాటికి దేశవ్యాప్తంగా 7 లక్షల గ్రామాల్లో ఇంటర్నెట్ సేవలు అందిస్తామన్నారు. డిజిటల్ అరెస్ట్ బెదిరింపు కాల్స్‌కు భయపడవద్దని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, సైబర్ క్రైమ్ డీఎస్పీ వెంకటరమణ, ఎస్సై కృష్ణ, ఎన్ఎస్ఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, క్లబ్ కో–ఆర్డినేటర్ గోవర్ధన్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని వినతి

రాయికల్: పట్టణంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని మంగళవారం బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి మాట్లాడుతూ నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఫోకస్ లైట్లు ఏర్పాటు చేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి భూమేశ్, బండ సంజీవ్, ఉపాధ్యక్షుడు తోపారపు ఆశన్న, శ్రీనివాస్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

• షెడ్డు నిర్మాణ దాతకు సన్మానం

సారంగాపూర్: మండల కేంద్రంలోని శ్రీసీతారామాలయ సముదాయానికి బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన ఓగుల అజయ్–అనీలా దంపతులు రూ. 4.70 లక్షలతో నిర్మించిన షెడ్డును స్వామివారికి మంగళవారం అంకితం చేశారు. ఆలయంలో జరిగే స్వామివారి కల్యాణం, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడానికి నిర్మించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అజయ్‌ను ఆలయ అర్చకులు, గ్రామస్తులు సన్మానించారు.

• బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

కోరుట్ల: భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డెపల్లి శ్రీనివాస్ అన్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ బూత్ కార్యకర్తల సహాయ నిధి నుంచి పట్టణంలోని సిరికొండ బాలరాజు కుటుంబానికి రూ.లక్ష, పసునూరి మహేశ్‌కు రూ.35వేలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేశ్, నాయకులు ఇట్యాల నవీన్, మహేష్, ధనుంజయ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

• సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మల్లాపూర్: సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, మండల వైద్యాధికారి డాక్టర్ వాహిని అన్నారు. మండలంలోని మొగిలిపేటలో మంగళవారం నిర్వహించిన హెల్త్ క్యాంప్‌లో గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌వో రామ్మోహన్, హెల్త్ సూపర్‌వైజర్ శకుంతల, సిబ్బంది పాల్గొన్నారు.

• రక్తదానం గొప్పది

జగిత్యాల: రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని ఐఎంఏ అధ్యక్షుడు హేమంత్ అన్నారు. మంగళవారం ఐఎంఏ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 26 మంది రక్తదానం చేయగా, వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి సుధీర్‌కుమార్, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి గీతిక తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రానికి భూమి కేటాయించండి

బుగ్గారం: మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రం కోసం 25 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరుతూ మంగళవారం వీడీసీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ తిరుపతికి వినతి పత్రం అందించారు. అలాగే మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు వాట్సాప్ ద్వారా వినతిపత్రం పంపించారు. ఈ సందర్భంగా వీడీసీ నాయకులు మాట్లాడుతూ గ్రామంలో ధాన్యం కొనుగోళ్లకు సరియైన స్థలం లేక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చుక్క గంగారెడ్డి,పెద్దనవేణి రాగన్న,నక్క చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అల్లీపూర్ విద్యార్థిని ఎంపిక

రాయికల్: మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అనూష షార్ట్‌పుట్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ కృష్ణప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈనెల 30, 31 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా అనూషను హెచ్ఎం పొరండ్ల కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు ఎత్తైన స్తంభాలు



మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న ఏఈ

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా ఎత్తైన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించినట్లు అంబారిపేట సెక్షన్ ఏఈ భూమేశ్వర్ మంగళవారం తెలిపారు. వినాయక విగ్రహాల ఊరేగింపు వేళల్లో ప్రజలకు ఇబ్బంది ఉండకూడదని ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నామన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డు పక్కన 42 ఎత్తైన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వైర్లను అమర్చినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ తీగల మరమ్మతు సమస్య ఉంటే ప్రజలు అధికారులు, సిబ్బందిని సంప్రదించాలన్నారు.

యూరియా పంపిణీలో కాంగ్రెస్ విఫలం



రాజారాంపల్లిలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వెల్గటూర్: రైతులకు యూరియా పంపిణీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ ఎండపల్లి మండల అధ్యక్షుడు సింహాచలం జగన్ ఆరోపించారు. మంగళవారం ఎండపల్లి మండలం రాజారాంపల్లి వద్ద 7వ నెంబర్ రాష్ట్ర రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, రైతుల కోసం కాళేశ్వరం కట్టి తెలంగాణను సస్యశ్యామలం చేశారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు సాగు నీరు అందించడంలో విఫలమవడమే కాక, కనీసం యూరియా పంపిణీలో కూడా పూర్తిగా విఫలమయ్యారని విమర్శలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జలంధర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గాజుల మల్లేశం, మండల బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

యూరియా కోసం తహసీల్దార్‌కు వినతి

బుగ్గారం: యూరియా అందక రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు సరిపడా యూరియాను అందించేందుకు చర్యలు చేపట్టాలని మండల బీఆర్ఎస్ నాయకులు మంగళవారం తహసీల్దార్ తిరుపతికి వినతి పత్రం అందించారు. రైతులకు సరిపడా యూరియాను తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో గాలిపెల్లి మహేష్,దసర్తి పూర్ణచందర్,చీర్నేని మల్లేషం, మూల శ్రీనివాస్, కట్ట రాజేందర్,పొన్నం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందిస్తున్న కాంగ్రెస్‌ను ఆదరించాలి



వేంపల్లిలో రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న నర్సింగరావు

మల్లాపూర్: ప్రజాపాలనతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండలంలోని వేంపల్లి, వెంకట్రావ్‌పేట, రేగుంట, సాతారం, గుండంపల్లి, చిట్టాపూర్, ముత్యంపేట గ్రామాల్లో కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డితో కలిసి ఆయన పర్యటించి పలు అభివృద్ధి పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నిరుపేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారన్నారు. కొత్త రేషన్‌కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు అందిస్తుంటే ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీలు చేస్తున్న డ్రామాలను ప్రజలు నమ్మెపరిస్థితి లేదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంతడపుల పుష్పలత నర్సయ్య, వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూంద్ర శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మామిడి లక్ష్మారెడ్డి, భూపెల్లి దేవయ్య, మాజీ ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

మల్యాల: మండలంలోని ముత్యంపేట జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం బీజేపీ నాయకులు విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మోడీ కానుక పేరిట సైకిళ్లు అందజేయగా, నాయకులు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజయ్య, బింగి వేణు, గాజుల మల్లేశం, సామ మహిపాల్ రెడ్డి, బొట్ల ప్రసాద్; కెల్లెటి రమేశ్, పన్నాటి మల్లేశం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

• క్రీడాకారులకు దుస్తులు..

గొల్లపల్లి: మండలంలోని చిల్వాకోడూర్ గ్రామానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక కాగా, వారికి మంగళవారం మాజీ ఎంపీటీసీ దాసరి తిరుపతిగౌడ్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులను ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు గుండి బుజ్జన్న, నక్క రాజయ్య, సికినికాంతం నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

• ఉపాధి కూలీలందరూ బీమా తీసుకోవాలి

కోరుట్ల రూరల్: ఉపాధి హామీ కూలీలు అందరూ బీమా తీసుకోవాలని ఎంపీడీవో ఓదెల రామకృష్ణ అన్నారు. మండలంలోని సంగెంలో ఉపాధి కూలీలకు బీమా అంగీకార పత్రాలను మంగళవారం అందించారు. ప్రతీ నెలా రూ. 20 చెల్లించవలసి ఉంటుందన్నారు. కూలీలు గ్రామపంచాయతీ కార్యదర్శుల నుంచి డిక్లరేషన్ పత్రాలు పొంది బ్యాంకులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శేఖర్, శంకర్ రాజం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

• ఎల్‌వోసీ అందజేత

కోరుట్ల: పట్టణంలోని 13వ వార్డుకు చెందిన గోడికె హర్ష అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు. దీంతో బాధితుడికి వైద్య ఖర్చుల కోసం డబ్బులు అవసరం కాగా, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ గౌడ్ కాంగ్రెస్ కోరుట్ల సెగ్మెంట్ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు, సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావుదృష్టికి తీసుకెళ్లగా, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో రూ. 3 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించి మంగళవారం బాధితుని తండ్రి గోడికె రాజుకు అందించారు.

• అంగన్‌వాడీ కేంద్రాల్లో ముందస్తు వినాయక చవితి వేడుకలు

పెగడపల్లి: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు, నంచర్ల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ముందస్తుగా వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి విద్యార్థులు, చిన్నారులు, అంగన్‌వాడీ టీచర్లు పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో హెచ్ఎం సుబ్బారావు, సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

జగిత్యాల: బీడీ కార్మికుల పిల్లలు స్కాలర్‌షిప్ కోసం నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వెల్ఫేర్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పలు స్కూళ్లను సందర్శించి మాట్లాడారు. బీడీ కార్మికుల పిల్లలు ప్రతీ ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీడీ కార్మిక ఆస్పత్రి వైద్యులు శ్రీకాంత్, మెడికల్ ఆఫీసర్ మధుకర్, శ్రీనివాస్, బీడీ కార్మిక నాయకులు శాంతమ్మ, లక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

• వైన్స్ టెండర్లలో 25శాతం కోటా ఇవ్వాలి

బుగ్గారం: మద్యం షాపుల టెండర్లలో గౌడ కులస్తులకు 25 శాతం కోటా ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం పాత పద్ధతినే కొనసాగించడం గౌడ కులస్తులను మోసగించడమేనని బుగ్గారం మండల గౌడ సంఘం అధ్యక్షుడు మూల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఇకనైనా ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి మద్యం దుకాణాల టెండర్లలో 25శాతం కోటాను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పొన్నం సత్తయ్య, బిసగోని తిరుపతి, ముంజాల కొమురవెల్లి, పొన్నం శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

• నలుగురి బైండోవర్

కథలాపూర్: మండలంలోని రాజారాం తండా శివారులో అటవీశాఖకు చెందిన భూమిని చదును చేసిన విషయంలో నలుగురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు అటవీశాఖ కథలాపూర్ సెక్షన్ ఆఫీసర్ ముస్తాక్ అలీ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చింతకుంట గ్రామానికి చెందిన సురిగి వెంకటేశ్, రాజారాం తాండాకు చెందిన లకావత్ రాజేశ్, లకావత్ రమేశ్, దుంపేటకు చెందిన బోదాస్ రాజులను ఎస్సై నవీన్‌కుమార్ అప్పగించగా, అనంతరం తహసీల్దార్ వినోద్ ఎదుట బైండోవర్ చేసినట్లు అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ ముస్తాక్ అలీ, బీట్ ఆఫీసర్ సాయిరాం వివరించారు.

• రాజేశ్వరరావుకు నివాళి

మెట్‌పల్లి: ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, మెట్‌పల్లి ఖాదీ ప్రతిష్ఠాన్ చైర్మన్ కల్వకుంట్ల రాజేశ్వరరావు సేవలు మరువలేనివని మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు.రాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు నివాళి అర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి,అన్నదానం చేశారు.కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు లింగారెడ్డి,నాయకులు మారుతి, ఖుతుబొద్దీన్‌పాషా, రాకేశ్,జాఫర్, నాగరాజు,శ్రీకాంత్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.